JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | బుధవారం 14-01-2026
Medchal - Malkajgiri | Wednesday 14-01-2026
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 229
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 229 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


## మోసపూరిత చర్యలు ఆపండి




- 25 శాతం సుంకాల హెచ్చరికల వేళ ట్రంప్‌కు ఖమేనీ గట్టి వార్నింగ్
- శత్రువుకు తలవంచం
- నిరసనకారులను చంపితే రంగంలోకి దిగుతాం

**జయభేరి, న్యూఢిల్లీ:**

మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకుంటున్నాయి. ఇరాన్‌లో కొన సాగుతున్న నిరసనలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న కఠిన నిర్ణయాల పై ఆ దేశ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమెరికా తన మోసపూరిత చర్యలను, నమ్మక ద్రోహులైన కిరాయి వ్యక్తులపై ఆధార పడటాన్ని తక్షణమే నిలిపి వేయాలని ఆయన హెచ్చరించారు.

## టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం..




- ఈ జిల్లాల నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులు
- స్పెషల్ బస్సులు 5,375
- తిరుగు ప్రయాణం కోసం జనవరి 18, 19 తేదీలలో కూడా ప్రత్యేక బస్సులు

**జయభేరి, హైదరాబాద్ :**

జనవరి 28 నుండి 31 వరకు జరిగే మేడారం సమ్మక్కసారలమ్మ జాతర కోసం టీజీఎస్ఆర్టీసీ భారీ ఏర్పాట్లు చేస్తోంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈసారి 3,495 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ...మిగతాది 2 లో

## నిరుద్యోగులకు సంక్రాంతి కానుక



- వైద్యారోగ్య శాఖలో కొలువుల జాతర
- మరో 10 వేల ఉద్యోగాలకు గ్రీన్ సిగ్నల్
- తెలంగాణలో కొత్త హెల్త్ పాలసీ

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలోని నిరుద్యోగులకు రేవంత్ సర్కార్ తీపి కబురు అందించింది. వైద్యారోగ్య శాఖలో భారీ స్థాయిలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. త్వరలోనే మరో 10 వేల కొత్త పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. ..మిగతాది 2 లో



- గ్రామాలే దేశానికి వెన్నెముక.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం రూ. 277 కోట్ల నిధులు విడుదల
- పల్లెల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించాలి
- బాధ్యతలు స్వీకరించిన నెల రోజుల్లోపే ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించడంపై గ్రామీణ ప్రాంతాల్లో హర్షం

# గ్రామ పంచాయతీలకు సంక్రాంతి కానుక

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ ప్రభుత్వం సంక్రాంతి కానుకగా గ్రామ పంచాయతీలకు రూ. 277 కోట్ల నిధులను విడుదల చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ఈ నిధులను మంజూరు చేసింది. 2025 డిసెంబర్‌లో ఎన్నికైన కొత్త పాలకవర్గాలకు ఇది మొదటి భారీ కేటాయింపు. ఈ నిధులను పల్లెల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించాలని ప్రభుత్వం సూచించింది. ఇచ్చిన మాట ప్రకారం బాధ్యతలు చేపట్టిన నెలలోనే నిధులు ఇవ్వడంపై సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంక్రాంతి పండుగ వేళ తెలంగాణలోని పల్లెలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త వినిపించింది. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 277 కోట్ల నిధులను మంగళవారం (జనవరి 13) విడుదల చేసింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ఈ నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులను గ్రామాలలోని అత్యవసర పనులు, పారిశుధ్యం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలని ప్రభుత్వం సూచించింది. రాష్ట్రంలో సుదీర్ఘ నిరీక్షణ తర్వాత 2025 డిసెంబర్‌లో మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. డిసెంబర్ 22న కొత్త సర్పంచులు, పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టాయి. బాధ్యతలు స్వీకరించిన నెల రోజుల్లోపే ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించడంపై గ్రామీణ ప్రాంతాల్లో ...మిగతాది 2 లో



# సొంతూరులో సంక్రాంతి సంబరాలు

- మనవళ్ల ఆటల పోటీలకు ఫిదా అయిన సీఎం చంద్రబాబు దంపతులు
- నారా భువనేశ్వరి ఆధ్వర్యంలో రంగవల్లులు, ఆటల పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేసిన సీఎం చంద్రబాబు దంపతులు
- స్కిల్ డెవలప్మెంట్ కేంద్రం, 33/11 కెవి సబ్ స్టేషన్

*ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంతూరు నారావారిపల్లిలో కోలాహలంగా సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. గ్రామస్తులను సీఎం దంపతులు ఆప్యాయంగా పలకరించారు. క్రీడా పోటీలను ఆసక్తిగా తిలకించారు. నారా భువనేశ్వరి ఆధ్వర్యంలో రంగవల్లులు, ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు..ఈ క్రీడల్లో లోకేష్ కుమారుడు దేవాన్ష్ పాల్గొన్నారు. ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేయనున్నారు.. సీఎం చంద్రబాబు ఇంటి దగ్గరే ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈనెల 15 వరకు నారావారిపల్లిలోనే సీఎం కుటుంబం ఉంటుంది.*

**తిరుపతి :**

తిరుపతి జిల్లాలోని సీఎం చంద్రబాబు నాయుడు సొంతూరు నారావారిపల్లిలో సంక్రాంతి సందడిగా సాగుతోంది. పెద్ద పండుగ సంక్రాంతి జరుపుకునేందుకు నారావారి పల్లికి వచ్చిన నారా, నందమూరి కుటుంబాలు నాలుగు రోజుల పాటు నారావారిపల్లి లోనే ఉండనున్నాయి. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు, సంప్రదాయ క్రీడల నిర్వహించగా.. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసారు సిఎం చంద్రబాబు, నారా భువనేశ్వరి.. నారావారిపల్లితో పాటు తిరుపతిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. నారావారిపల్లిలో స్కిల్ డెవలప్మెంట్ కేంద్రం, 33/11 కెవి సెమీ ఇండోర్ సబ్ స్టేషన్ ప్రారంభించారు. ఎ.రంగంపేట భీమవరం వరకు నిర్మించిన నూతన సిసి రోడ్డు, సంజీవిని ప్రాజెక్టు ...మిగతాది 2 లో

## టీవీకే విజయ్‌తో కాంగ్రెస్ పొత్తు!

- రాహుల్ గాంధీ హింట్..
- సొంత పార్టీలోవారి కోరిక కూడా అదే!



**జయభేరి, న్యూఢిల్లీ:**

ప్రముఖ తమిళ నటుడు, టీవీకే పార్టీ అధినేత విజయ్ నటిస్తున్న చివరి సినిమా 'జననాయగన్'. విడుదల నేపథ్యంలో ఈ సినిమా వివాదాల్లో చిక్కుకుంది. ఈ చిత్రం కంటెంట్‌పై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో ఈ వివాదం మద్రాసు హైకోర్టుకు చేరింది. అయితే జననాయగన్ విడుదలపై నెలకొన్న వివాదంపై తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ సినిమాను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. తమిళ సంప్రదాయాలపై బీజేపీ ...మిగతాది 2 లో

## జిల్లాల పర్యటనకు సీఎం రేవంత్

- ఆ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన!
- జనవరి 16 నుంచి తొలి విడత పర్యటన
- విదేశీ పర్యటన షెడ్యూల్
- ఫిబ్రవరి 3 మలి విడత
- ఉపాధి హామీపై నిరసన సభలు




**జయభేరి, హైదరాబాద్ :**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనలకు స్పష్టమైన రోడ్‌మ్యాప్ ఖరారైంది. ఈసారి పర్యటనను త్రిముఖ వ్యూహంతో నిర్వహించనున్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం,

▶▶ మొదటిపేజీ తరువాయి

## సంక్రాంతి కానుక

హర్షం వ్యక్తమవుతోంది. ఎన్నికల ప్రచార సమయంలో పల్లెల అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం ఈ విధంగా నెరవేర్చింది. పంచాయతీలకు విడుదల చేసిన ఈ నిధులు గ్రామాల్లోని పాలనను మరింత బలోపేతం చేయనున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా.. గ్రామాల్లో మురుగునీటి కాల్వల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి పైపులైన్ల నిర్వహణ వంటి పనులకు ఈ నిధులను ప్రాధాన్యత క్రమంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. పారిశుధ్య నిర్వహణలో భాగంగా.. పండుగ సీజన్ కావడంతో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచడానికి, చెత్త సేకరణ వాహనాల నిర్వహణకు ఈ నిధులు ఉపయోగపడతాయి. గత కొన్ని నెలలుగా నిధులు లేక నిలిచిపోయిన చిన్న తరహా అభివృద్ధి పనులకు ఈ కేటాయింపులు ఊపిరి పోయనున్నాయి. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు గ్రామ సభల ద్వారా తీర్మానాలు చేసి, ఈ నిధులను పారదర్శకంగా ఖర్చు చేయాలని అధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గ్రామాలే దేశానికి వెన్నెముక అని, కొత్తగా ఎన్నికైన ప్రతినిధులు పార్టీలకు అతీతంగా గ్రామ వికాసం కోసం పనిచేయాలని కోరారు. సంక్రాంతి కానుకగా అందిన ఈ నిధులతో పల్లెల్లో పండుగ వాతావరణం మరింత రెట్టింపు కానుంది.

## జిల్లాల పర్యటనకు సీఎం రేవంత్

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, అలాగే ఉపాధి హామీ పథకం అంశంపై కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నిరసన సభలు నిర్వహించడమే ఈ వ్యూహంలోని ప్రధాన అంశాలు. ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల వారీగా రెండు దఫాల పర్యటన షెడ్యూల్‌ను సీఎం ఖరారు చేశారు. బహిరంగ సభలతో పాటు వీలున్న చోట్ల కార్నర్ మీటింగ్లు నిర్వహిస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయనున్నారు.

**జనవరి 16 నుంచి తొలి విడత పర్యటన**

మొదటి విడత జిల్లాల పర్యటనను ఈ నెల 16 నుంచి ప్రారంభించనున్నారు. జనవరి 16, 17, 18 తేదీల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో సీఎం పర్యటించనున్నారు. ఈ పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడంతో పాటు పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నారు. నిర్మల్, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలకు కూడా హాజరవుతారు. జనవరి 16న నిర్మల్‌లో, 17న జడ్చర్లలో, 18న పాలేరు-ఖమ్మం ప్రాంతంలో సీఎం పర్యటన కొనసాగనుంది. అదే సమయంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని కూడా వేగవంతం చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు.

**విదేశీ పర్యటన షెడ్యూల్**

జనవరి 19న సీఎం మేడారం వెళ్లనున్నారు. అనంతరం అదే రోజు సింగపూర్, అమెరికా దేశాల పర్యటనకు బయలుదేరనున్నారు. ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. మరుసటి రోజు పరిస్థితిని బట్టి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

**ఫిబ్రవరి 3 నుంచి మలి విడత**

ఫిబ్రవరి 3 నుంచి రెండో విడత జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ విడతలో ఆరు రోజుల పాటు ఆరు ఉమ్మడి జిల్లాల్లో సీఎం పర్యటించనున్నట్లు సీఎంవో వర్గాలు వెల్లడించాయి. వరుసగా నల్లగొండ, కరీంనగర్, రంగారెడ్డి, వరంగల్, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో కూడా తొలి విడత తరహాలోనే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, అధికారిక కార్యక్రమాలు, పార్టీ కార్యకర్తలతో సమావేశాలు ఉంటాయి. కార్నర్ మీటింగ్లు, బహిరంగ సభల ద్వారా మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేయనున్నారు.

**ఉపాధి హామీపై నిరసన సభలు**

ఉపాధి హామీ పథకం విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఈ సభలను విజయవంతం చేయాల్సిన బాధ్యతను స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఆయా జిల్లాల మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులకు టీపీసీసీ అప్పగించనుంది. అయితే రెండో విడతలో చివరి రోజుల్లో సీఎం వెళ్లే మెదక్, నిజామాబాద్ జిల్లాలకు సంబంధించిన షెడ్యూల్ ఇంకా పూర్తిస్థాయిలో ఖరారు కావాల్సి ఉందని సమాచారం. మొత్తం మీద మున్సిపల్ ఎన్నికలకు ముందు జిల్లాల పర్యటనలతో రాజకీయంగా పూర్తి స్థాయిలో కదలిక తీసుకురావడమే సీఎం వ్యూహంగా కనిపిస్తోంది.

## టీవీకే విజయ్‌తో కాంగ్రెస్ పొత్తు!

సర్కార్ దాడి చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ అగ్రనాయకుడు అనూహ్యంగా టీవీకే విజయ్‌కు మద్దతు తెలపడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. 2026 తమిళనాడు ఎన్నికల నేపథ్యంలో టీవీకేతో పొత్తుకు కాంగ్రెస్‌కు ప్రయత్నిస్తోందా అనే సందేహాలు కూడా మొదలయ్యాయి. దీనిపై రాహుల్ గాంధీ ఇండైరెక్ట్‌గా హింట్ ఇచ్చారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జననాయగన్ సినిమా గురించిన మాట్లాడిన రాహుల్ గాంధీ.. విజయ్ సినిమా విడుదల కాకుండా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అడ్డుకుంటోందని ఆరోపించారు. అధికారంతో తమిళ ప్రజల గొంతును నొక్కాలని ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారన్నారు. అయితే అది ఎప్పటికీ సాధ్యం కాదని రాహుల్ అన్నారు. రాహుల్ గాంధీ చేసిన ఈ వ్యాఖ్యలు తమిళనాడులో కాంగ్రెస్ అనుసరించాల్సిన వ్యూహంపై కొత్త చర్చకు దారితీశాయి.

**సొంత పార్టీలోనే..!**

ఈ నేపథ్యంలో టీవీకేతో సంబంధాలను ఏర్పరచుకునే విషయంపై రాష్ట్ర కాంగ్రెస్ ఆలోచించాలని పార్టీలో ఒక వర్గం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా యువత, మొదటిసారి ఓటు వేసేవారిలో విజయ్‌కు ఉన్న పాపులారిటీ.. తమిళనాడులో కాంగ్రెస్‌కు కలిసివస్తుందని వారు భావిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా విజయ్, రాహుల్ గాంధీ ఇద్దరూ ప్రచారాలు నిర్వహిస్తే.. క్షేత్రస్థాయిలో ప్రజలతో బలంగా కనెక్ట్ కావచ్చని, తద్వారా రాష్ట్రంలో రాజకీయ వాతావరణాన్ని మార్చవచ్చని వారు అనుకుంటున్నారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో ఇది ఒక వర్గం అభిప్రాయం మాత్రమే అని తెలుస్తోంది. చాలా మంది సీనియర్ నాయకుల అభిప్రాయం ప్రకారం.. తమిళనాడులో కాంగ్రెస్.. డీఎంకేతో ఉన్న తన దీర్ఘకాలిక పొత్తుకు కట్టుబడి ఉండాలని భావిస్తున్నారు. డీఎంకేతో భాగస్వామ్యం అనేక సంవత్సరాలుగా స్థిరంగా ఉందని, రాష్ట్రంలో పార్టీకి ప్రాముఖ్యత, రాజకీయ ప్రయోజనాలను తీసుకువచ్చిందని వారు అంటున్నారు. ఇక టీవీకేతో కొత్త కూటమిని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించడం.. ప్రారంభంలో ఎంత ఉత్సాహంగా ఉన్నా.. దాని వెంటే ప్రమాదం కూడా పొంచి ఉందంటున్నారు. డీఎంకేకు దూరం కావడానికి బదులుగా..పొత్తులోనే బలమైన పాత్ర కోసం చర్చలు జరపాలని వారు వాదిస్తున్నట్లు తెలుస్తోంది.

## సొంతూరులో సంక్రాంతి సంబరాలు

ప్రారంభంతో పాటు మూలపల్లె ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసారు సీఎం. అనంతరం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ లో సెంట్రలైజ్డ్ అడ్వాన్స్ పరిశోధన ల్యాబ్ ను వర్చువల్ గా సిఎం చంద్రబాబు ప్రారంభించారు. సంక్రాంతి సంబరాలతో నారావారిపల్లి కోలాహలంగా మారింది. సంక్రాంతి సంబరాలలో నారా చంద్రబాబు కుటుంబ సభ్యులు పాల్గొని క్రీడలను ఆసక్తిగా తిలకించారు. సిఎం దంపతులు గ్రామస్థులతో సరదాగా గడిపారు. నారా భువనేశ్వరి ఆధ్వర్యంలో రంగవల్లులు, ఆటల పోటీలు జరగ్గా.. గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేసారు సీఎం. ఇంటి వద్ద ప్రజల వద్ద నుంచి వినతులను కూడా సీఎం చంద్రబాబు స్వీకరించారు. ఆటల పోటీలను సీఎం చంద్రబాబు, భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, నారా బ్రాహ్మిణి, ఎంపీ భరత్, ఆయన భార్య తేజస్విని, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, శాప్ చైర్మన్ రవి నాయుడు, తిరుపతి జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తిలకించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలబాలికలకు బహుమతుల పంపిణీ చేసారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ పండుగ వాతావరణం ఉట్టిపడేలా నారావారిపల్లిలో సంక్రాంతి సంబరాలు జరుగుతున్నాయి. ఆటల్లో పాల్గొన్న లోకేష్ కొడుకు దేవాన్ష్, విశాఖ ఎంపీ భరత్ కొడుకు అందరినీ ఆకట్టుకున్నారు. పాటల పోటీలో గెలిచి తాత సీఎం చంద్రబాబు చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు.

# రూపాయి బలహీనత వెనుక వ్యూహం

భారత రూపాయి విలువ రోజురోజుకూ పడిపోతోంది. ఆల్‌టైమ్ కనిష్టానికి చేరింది. ప్రస్తుతం ఒక డాలర్‌తో పోలిస్తే రూ.90 మార్కును దాటింది. దీంతో దేశంలో ద్రవ్యోల్బణం భయాలు పెరిగాయి. సామాన్యుడిపై ఆర్థిక ఒత్తిడి పెరుగుతుంది. కానీ ఈ పతనం వెనుక ఆర్బీఐ ఒక గొప్ప వ్యూహాత్మక ప్రణాళిక దాగి ఉంది. అమెరికా భారీ టారిఫ్‌లను ఎదుర్కోవడానికి దేశీయ ఆర్థిక వృద్ధిని కాపాడటానికి మానిటరీ పాలసీని రూపాయిని ఆయుధంగా మార్చారు.రూపాయి 90కి చేరడం కేవలం పతనం కాదు, ఆర్థిక పోరాటంలో భాగమే. అమెరికా ట్రంప్ పరిపాలన భారత దిగుమతులపై 25-60% టారిఫ్‌లు విధించడంతో దేశీయ పరిశ్రమలు ఒత్తిడిలో పడ్డాయి. దీంతో ఆర్బీఐ రేట్ కట్‌లు, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచి రూపాయి విలువను కొంత బలహీనపరచడం ద్వారా ఎగుమతులకు పోటీశక్తి పెంచింది. దీంతో టెక్స్‌టైల్స్, ఫార్మా, ఐటీ రంగాలు ప్రయోజనం పొందాయి.అమెరికా భారత ఉత్పత్తులపై టారిఫ్‌లు పెంచడంతో దిగుమతుల ఖర్చు రూ.50 వేల కోట్లు పెరిగింది. రూపాయి 85 నుంచి 90కి చేరడంతో భారత ఎగుమతులు 8-10% పోటీశక్తి పొందాయి. ఎంఎస్‌ఎంఈలు, చిన్న పరిశ్రమలు అమెరికా మార్కెట్‌లో ధరల పోటీలో ముందుకు వచ్చాయి. ఆర్బీఐ ఫారిన్ ఎక్స్ఛేంజ్ రిజర్వులను 650 బిలియన్ డాలర్లకు చేర్చి మార్కెట్ స్థిరత్వం కాపాడిందిఆర్బీఐ రెపోరేట్‌ను 6.25%కి తగ్గించి రుణాల ఖర్చును తగ్గించింది. ద్రవ్యోల్బణం 4.5%లో ఉంచి ఆర్థిక వృద్ధిని 7%కి చేర్చారు. రూపాయి బలహీనత వల్ల ఇంపోర్టెడ్ ఇన్‌ఫ్లేషన్ పెరిగినా, దేశీయ ఉత్పత్తులపై ఆధారపడటం పెరిగింది. పీఎల్ఐ స్కీమ్‌లు, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాలు ఈ వ్యూహానికి మద్దతుగా నిలిచాయి.

రూపాయి వ్యూహం వల్ల భారత్ యూరోప్, ఆఫ్రికా మార్కెట్‌ల వైపు మళ్లింది. అమెరికా టారిఫ్‌ల ప్రభావం 40%కి తగ్గింది. పీఎల్ఐ స్కీమ్‌ల కింద మొబైల్స్, ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 25% పెరిగాయి. 2026 చివరిలో రూపాయి 88-89 పరిధిలో స్థిరపడి జీడీపీ 7.5% వృద్ధి సాధిస్తుందని అంచనా.భారత్ పెట్రోల్, ఫోన్లు, యంత్రాలు వంటి చాలా వస్తువులను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. ఇవి ఎగుమతుల కంటే చాలా ఎక్కువగా ఉన్నాయి. డాలర్ ప్రపంచంలోనే పెద్ద కరెన్సీ. కాబట్టి అన్ని దిగుమతులకు డాలర్‌లోనే డీల్ ఉంటుంది. రూపాయి తగ్గితే, దిగుమతి ధర పెరుగుతుంది. దీన్ని 'ఇంపోర్టెడ్ ఇన్‌ఫ్లేషన్' అంటారు. దీని వల్ల ధరలు పెరిగి ఆర్థిక వ్యవస్థపై చెడు ప్రభావం పడుతుందిరూపాయి బలహీన



పడితే ఎగుమతులు చేసే కంపెనీలకు ప్రయోజనం ఉంటుంది. ఒకవేళ బలపడితే దిగుమతులు చేసేవారికి ప్రయోజనం ఉంటుంది. ప్రస్తుతం రూపాయి భారీగా పడిపోతోంది కాబట్టి డాలర్ రెవెన్యూ పొందే కంపెనీలకు ప్రయోజనం ఉంటుంది. ముఖ్యంగా 5 పెద్ద కంపెనీలకు లాభం ఉంటుంది. వీటి వివరాలు ఇప్పుడు చూద్దాం.

ఐటీ కంపెనీలు రూపాయి తగ్గడం వల్ల మంచి లాభం పొందతాయి. ఎందుకంటే వాళ్ల ఆదాయం ఎక్కువగా డాలర్‌లోనే వస్తుంది. ఇన్ఫోసిస్‌కి అమెరికా నుంచి 22 బిలియన్ డాలర్ల ఆదాయం వస్తుంది. కంపెనీ మొత్తం ఆదాయంలో ఇదే 60 శాతం ఉంటుంది. అయితే క్లయింట్లకు కొంచెం డిస్కౌంట్ ఇవ్వాల్సి వస్తుంది. అయినా, మిగిలిన లాభం ఆపరేటింగ్ మార్జిన్‌లో కనిపిస్తుంది.2025 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయంలో 31 శాతం, సుమారు 2 బిలియన్ డాలర్లు US నుంచే వచ్చింది. అక్కడి మార్కెట్ ధరలు రెవెన్యూకి చాలా కీలకం. జెనరిక్ మెడిసిన్ లో ధరల ఒత్తిడి ఉంది. కానీ స్పెషాలిటీ డ్రగ్స్ (ప్రత్యేక మందులు) సెగ్మెంట్‌ను కంపెనీ పెంచుకుంటోంది. USలో స్పెషాలిటీ మందులకు పెద్ద మార్కెట్. కాబట్టి రూపాయి తగ్గడం ఈ కంపెనీకి మంచిది.2025 ఆర్థిక సంవత్సరంలో జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఆదాయంలో 23 శాతం అమెరికా నుంచే వచ్చింది. అమెరికా అదనపు టారిఫ్‌లు కంపెనీకి ఇబ్బంది కలిగించాయి. త్రైమాసిక ఫలితాల్లోనూ ఈ ప్రభావం కన్పించింది. అయితే భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందం ఓకే అయితే టారిఫ్‌లు తగ్గి, JLRకి మంచి రెవెన్యూ వస్తుంది. రూపాయి తగ్గడం వల్ల ఎగుమతుల ఖర్చు తగ్గుతుంది. అలాగే కంపెనీ మార్కెట్ పెరుగుతుంది.రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగుమతులు కూడా చేస్తుంది. పెట్రోకెమికల్స్, రిఫైనింగ్ వ్యాపారంలో అమెరికా, యూరప్‌కు వస్తువులు అమ్ముతుంది. రూపాయి తగ్గడం వల్ల డాలర్ ఆదాయం ఎక్కువ అవుతుంది. అయితే ఈ కంపెనీ దిగుమతులు కూడా ఎక్కువే ఉన్నాయి. ముఖ్యంగా క్రూడ్ ఆయిల్ ను ఎక్కువగా దిగుమతి చేసుకుంటుంది. పూర్తిగా లాభం కాకపోయినా, ఎగుమతుల ద్వారా కొంత ప్రయోజనం పొందుతుంది. స్టీల్, మెటల్స్ ఎగుమతులకు రూపాయి తగ్గడం వల్ల ప్రయోజనం ఉంటుంది. విదేశాలకు స్టీల్ అమ్మేటప్పుడు డాలర్‌లో ఎక్కువ రూపాయిలు వస్తాయి. టాటా స్టీల్ అమెరికా, యూరప్ మార్కెట్లలో బలంగా ఉంది. గ్లోబల్ స్టీల్ డిమాండ్ బాగుంటే కంపెనీ ఎక్కువ ప్రయోజనం పొందుతుంది.మొత్తంగా ఆర్బీ రూపాయిని ఆయుధంగా మార్చి అమెరికా టారిఫ్ యుద్ధంలో భారత్ విజయం సాధించింది. సామాన్యుడికి తాత్కాలిక ఒత్తిడి ఉన్నా, దీర్ఘకాలంలో ఆర్థిక స్థిరత్వం, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

## మోసపూరిత చర్యలు ఆపండి

**శత్రువుకు తలవంచం: ఖమేనీ**

86 ఏళ్ల ఖమేనీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. "మహా శక్తివంతమైన ఇరాన్ దేశం శత్రువుల ముందు తన సంకల్పాన్ని, ఉనికిని చాటుకుంది. అమెరికా రాజకీయ నాయకులు తమ కుట్రలను ఆపుకోవాలి. ఇరాన్ ప్రజలు చాలా చైతన్యవంతులు. వారికి శత్రువు ఎవరో తెలుసు. వారు ఎల్లప్పుడూ పోరాటానికి సిద్ధంగా ఉంటారు" అని పేర్కొన్నారు. 1979 నాటి విప్లవం తర్వాత ఇరాన్ ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలుగా భావిస్తున్న ఈ నిరసనల్లో ఇప్పటి వరకు 646 మంది మరణించినట్లు మానవ హక్కుల సంఘాలు చెబుతున్నాయి.

**నిరసనకారులను చంపితే రంగంలోకి దిగుతాం..**

ఇరాన్ ప్రభుత్వం నిరసనకారులను చంపడాన్ని కొనసాగిస్తే అమెరికా సైన్యం రంగంలోకి దిగుతుందని ట్రంప్ ఇప్పటికే "లాక్డ్ అండ్ లోడెడ్" అంటూ హెచ్చరించారు. తక్కువ ప్రమాదం నుంచి అత్యంత తీవ్రమైన సైనిక చర్యల వరకు అన్ని ఆప్షన్లను పరిశీలిస్తున్నట్లు వైట్ హౌస్ ప్రకటించింది. దీనికి తోడు ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలపై 25 శాతం అదనపు సుంకాలు విధిస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయం ప్రపంచ వాణిజ్య రంగంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇరాన్‌ను ఆర్థికంగా ఒంటరి చేయడమే లక్ష్యంగా ట్రంప్ ఈ ఆర్థిక అస్త్రాన్ని ప్రయోగించారు.

**ఇంటర్నెట్ సేవలూ పునరుద్ధిస్తామంటూ హామీ..**

నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఆర్థిక సంక్షోభంతో మొదలైన ఈ నిరసనలు.. ఇప్పుడు ఇరాన్ క్లెరికల్ ప్రభుత్వ పతనమే లక్ష్యంగా సాగుతున్నాయి. ఇరాన్ ప్రభుత్వం ఇప్పటికే ఇంటర్నెట్‌ను నిలిపి వేయగా.. ఎలాగైనా సరే ఆ దేశ పౌరులకు ఇంటర్నెట్ సేవలు అందేలా చేస్తామని ట్రంప్ ప్రకటించడం గమనార్హం. మరోవైపు ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన సంప్రదింపులు కూడా జరుగుతున్నాయి. ట్రంప్ సన్నిహితుడు స్టీవ్ విట్‌కాఫ్ నేతృత్వంలో ఈ రహస్య చర్చలు సాగుతున్నట్లు సమాచారం. అయితే బయటకు మాత్రం అమెరికా తన దూకుడును ఏమాత్రం తగ్గించడం లేదు. ఒకవేళ ఇరాన్ ప్రభుత్వం కూలిపోతే మధ్యప్రాచ్య రాజకీయ ముఖచిత్రమే మారిపోతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఉద్రిక్తతలు ఎక్కడికి దారితీస్తాయో అన్న ఉత్కంఠ ఇప్పుడు ప్రపంచ దేశాల్లో నెలకొంది.

## నిరుద్యోగులకు సంక్రాంతి కానుక

మంగళవారం హైదరాబాద్ కోఠిలోని ఉస్మానియా వైద్య కళాశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రేడ్2 ల్యాబ్ టెక్నీషియన్లకు నియామక పత్రాలను అందజేస్తూ ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రజల, ముఖ్యంగా పేదల ఆరోగ్య భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన కేవలం రెండేళ్ల కాలంలోనే వైద్యారోగ్య శాఖలో ఇప్పటివరకు 9,572 ఉద్యోగాలను భర్తీ చేశామని మంత్రి వెల్లడించారు. దీనికి అదనంగా మరో 7,267 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రస్తుతం వివిధ దశల్లో ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రానున్న రోజుల్లో మరో 10 వేల పోస్టులను భర్తీ చేయబోతున్నట్లు పేర్కొన్నారు. 1,257 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీని రికార్డు సమయంలో పూర్తి చేసి, సంక్రాంతి కానుకగా అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. వైద్య వ్యవస్థలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్రను మంత్రి కొనియాడారు. గతంలో లక్షణాలను బట్టి వైద్యం చేసేవారు, కానీ నేడు ఖచ్చితమైన రోగ నిర్ధారణ తర్వాతే చికిత్స జరుగుతోందని చెప్పారు. డాక్టర్లకు ల్యాబ్ టెక్నీషియన్లు ఇచ్చే రిపోర్టులే ప్రామాణికమని.. వారు వ్యవస్థకు కళ్లు, చెవుల వంటి వారని అభివర్ణించారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో వైద్య విద్యార్థుల హాస్టల్ వసతి కోసం రూ.200 కోట్లు కేటాయించామని, త్వరలో తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను 'సెకండరీ హెల్త్ కేర్'గా మార్చబోతున్నామని ఆయన వెల్లడించారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రుల పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని, నూతన హెల్త్ పాలసీని తీసుకురానున్నట్లు ప్రకటించారు.

## టీజీఎస్‌ఆర్టీసీ కీలక నిర్ణయం

ఆదిలాబాద్ జిల్లాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. ముఖ్యంగా.. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నారు. అయితే.. ప్రత్యేక బస్సుల నిర్వహణ దృష్ట్యా సాధారణ ఛార్జీపై 50 శాతం అదనపు మొత్తాన్ని వసూలు చేయనున్నారు. సంక్రాంతి రద్దీ ముగిసిన వెంటనే తెలంగాణ ఆర్టీసీ మరో అతిపెద్ద సవాలుకు సిద్ధమవుతోంది. జనవరి 28 నుండి 31 వరకు జరిగే మేడారం సమ్మక్కసారలమ్మ జాతర కోసం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి 3,495 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుండి భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉండటంతో ఆయా మార్గాల్లో అదనపు బస్సులు అందుబాటులో ఉంటాయి. మేడారం వెళ్లే ఆర్డినరీ మరియు ఎక్స్‌ప్రెస్ బస్సులలో కూడా 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం వర్తిస్తుందని సంస్థ స్పష్టం చేసింది. అయితే దూర ప్రాంతాల నుండి నడిచే లగ్జరీ బస్సులకు ఇది వర్తించదు.

పండుగలు, జాతరల సమయంలో నడిపే ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీ కంటే 50 శాతం అదనంగా వసూలు చేసేందుకు ఆర్టీసీకి అనుమతి ఉంది. ఈ నిబంధన మేడారం ప్రత్యేక బస్సులకు వర్తిస్తుంది. ప్రయాణికుల సందేహాల నివృత్తి కోసం 040 6944 0000, 040 2345 0033 నంబర్లతో కాల్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ తీసుకున్న ఈ ముందస్తు చర్యల వల్ల ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండా సులభంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

**స్పెషల్ బస్సులు 5,375..**

ఇదిలా ఉండగా.. సంక్రాంతి పండుగ రద్దీని తట్టుకునేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ భారీ ఏర్పాట్లు చేసింది. నగరాల నుంచి పల్లెలకు వెళ్లే ప్రయాణికుల కోసం జనవరి 9 నుండి 13వ తేదీ వరకు మొత్తం 5,375 ప్రత్యేక బస్సులను నడిపింది. హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్ల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పక్కా ప్రణాళికతో ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేసింది. హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల నుండి బస్సుల రాకపోకలను అధికారులు నిరంతరం పర్యవేక్షించారు. పండుగ ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణం అయ్యే వారి కోసం జనవరి 18, 19 తేదీలలో కూడా ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచనున్నారు.




## 30 మందిని సస్పెండ్ చేసిన ప్రభుత్వం

- వ్యవసాయ వర్సిటీలో మాల్ ప్రాక్టీస్
- లీకైన పేపర్, వాట్సప్ గ్రూపుల్లో జవాబులు
- 30 మంది ఏఈవోలు సస్పెండ్

జయభేరి, హైదరాబాద్ :

ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం (PJTSAU) పరీక్షల్లో వెలుగుచూసిన 'ప్రశ్నపత్రాల లీకేజీ' వ్యవహారంలో సర్కార్ కఠిన చర్యలు తీసుకుంది. వర్సిటీలో ఇన్‌సర్వీస్ కోటా కింద బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతూ.. అక్రమ మార్గాల్లో పరీక్షలు రాసిన 30 మంది వ్యవసాయ విస్తరణాధికారులపై ప్రభుత్వం సోమవారం సస్పెన్షన్ వేటు వేసింది. రాష్ట్ర చరిత్రలో ఒకేసారి ఇంతమంది ప్రభుత్వ ఉద్యోగులు సస్పెండ్ కావడం ఇదే ప్రథమం కావడం గమనార్హం. గత నవంబరులో జరిగిన మూడో సంవత్సరం సెమిస్టర్ పరీక్షల సందర్భంగా ఈ అక్రమాలు చోటుచేసుకున్నాయి. వరంగల్ వ్యవసాయ కళాశాల కేంద్రంగా ప్రశ్నపత్రం లీకైనట్లు అధికారులు గుర్తించారు. నిందితులు కేవలం పేపర్‌ను లీక్ చేయడమే కాకుండా.. అధునాతన సాంకేతికతను వినియోగించినట్లు తేలింది. వాట్సప్ గ్రూపుల ద్వారా ప్రశ్నపత్రాలను పంచుకోవడమే కాకుండా.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెన్నులను ఉపయోగించి సమాధానాలు రాసినట్లు వర్సిటీ అంతర్గత విచారణలో వెల్లడైంది. ఈ తీవ్రమైన ఉల్లంఘనను పరిగణనలోకి తీసుకున్న విశ్వవిద్యాలయ అధికారులు ఇప్పటికే సదరు ఏఈవోల ప్రవేశాలను రద్దు చేశారు. విశ్వవిద్యాలయ నివేదిక మేరకు వ్యవసాయ శాఖ ఈ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. జగిత్యాలలో 8 మంది ఏఈవోలు, వరంగల్‌లో ఐదుగురు, పాలెంలో ఐదుగురు, రాజేంద్రనగర్‌లో నలుగురు, సిరిసిల్లలో ముగ్గురు, అశ్వారావుపేటలో ముగ్గురు, ఆదిలాబాద్‌లో ఇద్దరు చొప్పున మొత్తం 30 మందిపై సస్పెన్షన్ వేటు వేసింది. ఇన్‌సర్వీస్ కోటాలో ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని దుర్వినియోగం చేస్తూ అక్రమాలకు పాల్పడటాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ లీకేజీ వ్యవహారంలో మూలాలు వెలికి తీసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. వర్సిటీ రిజిస్ట్రార్ విద్యాసాగర్ సోమవారం డీజీపీ శివధర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి లోతైన దర్యాప్తు కోసం సీఐడీ విచారణకు డీజీపీ ఆదేశించారు. ఒకట్రెండు రోజుల్లోనే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి వర్సిటీకి పంపిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కుట్ర వెనుక ఎవరెవరు ఉన్నారు ? వాట్సప్ గ్రూపుల నిర్వహణ ఎలా సాగింది ? ఇతర విద్యార్థుల పాత్ర ఏమైనా ఉందా ? అనే కోణంలో దర్యాప్తు సాగనుంది.

# సూతరిగుడా చెరువును కాపాడండి

- మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుదాన్ష్ కు కాంగ్రెస్ నేతల వినతి..
- సీఎంఆర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**జయభేరి, మేడ్చల్ :**

సీఎంఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ మరియు సీఎంఆర్ హాస్పిటల్ నుండి ఎలాంటి ఎస్టిపి (STP) ప్లాంట్ లేకుండా డ్రైనేజ్ మురుగు నీటిని నేరుగా సూతరిగుడా చెరువులోకి వదులుతున్న కళాశాల యాజమాన్యం పై కఠిన చర్యలు తీసుకోవాలని గుండ్లపోచంపల్లి కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ అద్వర్యంలో సీఎంఆర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుదాన్ష్ కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం డివిజన్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎంఆర్ కళాశాల, హాస్పిటల్ నుండి వదులుతున్న మురికినీటితో చెరువు నుండి వస్తున్న తీవ్ర దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని, చెరువులోకి డ్రైనేజ్ నీరు కలవడంతో దోమలు, గుర్రం డెక్క విపరీతంగా పెరిగి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి అనేక రోగాలతో గ్రామ ప్రజలు బాధపడుతున్నరని తెలిపారు. అంతే కాకుండా చెరువునీరు కలుషితం అవడంతో చేపలు, పక్షులు, జంతువులు మృత్యువాత పడుతున్నారని దింతో చేరువుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ సమస్యపై తక్షణమే చర్యలు తీసుకుని డ్రైనేజ్ నీటిని చెరువులోకి వదలకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ డిప్యూటీ కమిషనర్ కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి ఓపిసిఎల్ చైర్మన్ రవి ముదిరాజ్, మాజీ సర్పంచిలు మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, సాకారబోయిన మల్లేష్ ముదిరాజ్ (వర్కింగ్ ప్రెసిడెంట్), కోమలత, రాజేందర్, చిల్ల వెంకటేశ్, సాయిపేట మల్లేష్, వినోద్, కావలి భాస్కర్, కుండ భాను, మాధవ్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్ ముదిరాజ్, శివ ముదిరాజ్, కిషన్, సాయికుమార్, హర్షత్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



## సమాజానికి సేవ చేసే వైద్యులుగా ఎదగాలి

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి 17 మంది విద్యార్థులకు దాదాపు 7 లక్ష రూపాయల చెక్కులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, విద్యే భవిష్యత్తుకు బాటలు వేసే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన ప్రతిభావంతమైన విద్యార్థులకు BLR చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలుస్తుంది అని ఆయన అన్నారు. వైద్య విద్య అభ్యసిస్తూ భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానిక నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఎంబీబీఎస్ విద్యార్థులు బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజల్లో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన



**జయభేరి, మేడిపల్లి :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ARRIVE ALIVE" రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రజల్లో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో ఈరోజు మల్కాజ్గిరి కమిషనరేట్ మేడిపల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "Arrive Alive" అనే ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని ఉప్పల్ డిపో జోనల్ వర్క్ షాపులో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ మేడిపల్లి ఆర్ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ.. వాహనదారులు, పాదచారులు, సాధారణ ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా, ద్విచక్ర వాహనంపై ప్రయాణించే యువత హెల్మెట్ ని కచ్చితంగా ధరించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ సూచనలను తప్పకుండా పాటించాలని, అతివేగంతో నిర్లక్ష్యంతో విలువైన ప్రాణాలను కోల్పోకూడదని సూచించారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న జోనల్ వర్క్ షాప్ మేనేజర్ జగన్ మాట్లాడుతూ..దాదాపు 80% రోడ్డు ప్రమాదాలు ద్విచక్ర వాహనాల వల్లనే జరుగుతున్నాయని, ఈ కార్యక్రమంలో పాల్గొన్న మేడిపల్లి తహసిల్దార్ కృష్ణ చైతన్య గారు మాట్లాడుతూ కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడప రాదని ,మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపకూడదనే అంశాలపై స్పష్టంగా వివరించారు, అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న Orthopedic Dr రోహిత్ మాట్లాడుతూ.. "ప్రమాదం చెప్పి రాదు అని సురక్షంగా వాహనాన్ని నడిపి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని" సూచించారు, అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో జరిగిన తీవ్రమైన గాయాల ద్వారా తను చేసిన సర్జరీలను అనుభవపూర్వకంగా వివరించారు, అదేవిధంగా ఈ కార్యక్రమంలో తీవ్రమైన గాయాలైన బాధితులు రోడ్డు ప్రమాదంలో తన కుటుంబాన్ని కోల్పోయిన బాధితులు తాము ఎంత శోకసంద్రం లో సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా శోభను అనుభవిస్తున్నాము వివరించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రతి ఒక్కరూ తమ కుటుంబానికి సురక్షితంగా చేరుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. "Arrive Alive - గమ్యానికి చేరుకోండి, ప్రాణాలతో" అనే నినాదాన్ని ప్రజలందరి ద్వారా Oath చేయించి తమ జీవితంలో అమలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డిపో చెంగిచెర్ల డిపో డ్రైవర్సు సిబ్బంది, ఆటో యూనియన్ ప్రతినిధులు, డ్రైవర్స్, లారీ అడ్డ ప్రతినిధులు డ్రైవర్స్, లోకల్ ప్రజా ప్రతినిధులు దాదాపు 200 మంది పాల్గొన్నారు.





## విద్యుత్ చార్జీలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ

- అనకాపల్లి ఏపీ ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ జి ప్రసాద్

**జయభేరి, పరవాడ:**

విద్యుత్ చార్జీల (టారిఫ్) పై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సి) ఈనెల 20 నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి ఏపీ ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ జి ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.202627 సంవత్సరానికి గాను ఏపీఈఆర్సి చైర్మన్ పివి రెడ్డి ఆధ్వర్యంలో 4 రోజులు పాటు జరిగే ప్రజాభిప్రాయ సేకరణను తిరుపతి, విజయవాడ, కర్నూలు లలో నిర్వహించనున్నట్లు తెలిపారు.20 న తిరుపతి,22,23 తేదీల్లో విజయవాడ,27 న కర్నూలులో ఉదయం 10:30 నుంచి ఒంటి గంట వరకు ( వ్యక్తిగతంగా), 2 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరుగుతాయన్నారు. ఏపీఈఆర్ అధికారులతో పాటు ఏపీ ఇంధనశాఖ, ఏపీ ట్రాన్స్కో,ఏపీ జెన్కో, ఏపీ ఈపీడీసీఎల్, ఏపీ ఎస్పీడీసీఎల్,ఏపీసీపీడీసీఎల్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రతిరోజు 3 విద్యుత్ సంస్థల టారిఫ్ ఫైలింగ్ కు సంబంధించి ప్రజాభిప్రాయాలను సేకరిస్తారని తెలిపారు. అభిప్రాయాలు చెప్పదలుచుకున్న వారు అనకాపల్లి జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ వారి కార్యాలయం లేదా కశింకోట కార్యనిర్వాహక ఇంజనీర్ వారి కార్యాలయం లేదా నర్సీపట్నం కార్యనిర్వహక ఇంజనీర్ వారి కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నామని ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పేర్లు నమోదు చేసుకొని వారు విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితో అభిప్రాయాలను తెలియచేయవచ్చన్నారు. ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు తెలుసుకునేందుకు వీలుగా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత సంస్థలు ఈ విచారణల్లో ప్రత్యక్షంగా గాని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గాని పాల్గొనుటకు అనకాపల్లి 9440816377 జిల్లా పర్యవేక్షక ఇంజనీరు వారి కార్యాలయం,కశింకోట 944086352,నర్సీపట్నం 9491049790 కార్యనిర్వాహక ఇంజనీర్ల వారి కార్యాలయాలను సంప్రదించాలని ఏపీ ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## మౌలిక వసతులపై సుదీర్ఘంగా చర్చ

- చుంచనకోట గ్రామ సర్పంచ్ గొర్రె శ్రీనివాస్ ని ఉప్పల్ ఎమ్మెల్యే పీఏ ఆలేటి రమేశ్ సన్మానించారు



**జయభేరి, హైదరాబాద్ :**

సర్పంచ్ గా గెలిచిన తర్వాత తమ ఇంటికి వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యలు, మౌలిక వసతులపై సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను అభినందించిన ఆయన, భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

## మహిళలకు ఇష్టమైన పండుగ సంక్రాంతి

- మాజీ జడ్పిటిసి సాయిపేట శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు..
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు బహుమతుల ప్రదానం..



**జయభేరి, మేడ్చల్ :**

మహిళల్లో చైతన్యాన్ని వెలికితీసి పోటీ తత్వాన్ని అభివృద్ధి చేసే కార్యక్రమాలుగా ముగ్గుల పోటీలు నిలుస్తాయని గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ జడ్పిటిసి సాయిపేట శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో సాయిపేట శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబరిచిన మహిళలకు సాయిపేట శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి మౌనిక, రెండవ బహుమతి శిరీష, మూడవ బహుమతి భాగ్య అందుకున్నారు. ఈ సందర్భంగా సాయిపేట శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు ముందుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు ఇష్టమైన పండుగ సంక్రాంతి అని, ముగ్గుల పోటీలు మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు దోహదపడతాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. మహాలక్ష్మి, ఇందిరా మహిళ శక్తి వంటి పథకాలను అమలు చేస్తూ ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి బండారి నరేందర్, డివిజన్ మహిళ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జంగిటి మమత, ఏ బ్లాక్ అధ్యక్షురాలు తాటికాయల కోమలత, మాజీ ఎంపిటిసి రాజేశ్వర్, చిల్ల వెంకటేష్, సాయిపేట మల్లేష్, కృష్ణారెడ్డి, కావలి భాస్కర్, కుండ బానుచందర్, సాయికుమార్, వడ్డే ప్రవీణ్, షబ్బీర్, పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి రేణుక ఆలయం వార్షికోత్సవ ఆహ్వానం పత్రిక అందజేత

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తాను సన్మానించిన కాచారం ఆలయ పూజారి వంగపల్లి అంజయ్య స్వామి



**జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 13:**

యాదగిరిగుట్ట మండలంలోని కాచారం గ్రామంలో నెలవైన శ్రీ గౌరీ రేణుక వాసవి బసవలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం మహోత్సవానికి తరలిరావాలని ఆ దేవాలయం పూజారి వంగపల్లి అంజయ్య స్వామి ఆహ్వాన పత్రికను మంగళవారం హైదరాబాదులోని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తాకు అందజేశారు. ఈ సందర్భంగా వంగపల్లి అంజయ్య స్వామి మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని కాచారం గ్రామంలో శ్రీ గౌరీ రేణుక బసవలింగేశ్వరస్వామి ఆలయం 29వ వార్షికోత్సవం, 30న అన్నపూర్ణ అన్నసత్రం, వార్షికోత్సవం వేడుకలు ఫిబ్రవరి 1న 2026 ఆదివారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో శివపార్వతుల కళ్యాణం,రేణుక జమదగ్ని కళ్యాణం,వాసవి మాతకు కుంకుమార్చన,రుద్రయాగం, ప్రత్యేక పూజలు జరగనున్నాయని,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## టిఆర్ పి పార్టీలో చేరిన మాజీ జెడ్పి వైస్ చైర్మన్




**జయభేరి, తుర్కపల్లి, జనవరి 13 :**

తుర్కపల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన మాజీ జిల్లా జెడ్పి వైస్ చైర్మన్ ధనావత్ బిక్కు నాయక్ మంగళవారం పి అర్ పి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు,ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సమక్షంలో టిఆర్పి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ పార్టీలో పనిచేసిన తనను ఆ పార్టీ వాళ్లు ఎస్సీ ,ఎస్టీలకు సముచిత స్థానం కల్పించడం లేదని, టీఆర్పి పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదాపురం మాజీ సర్పంచ్ కొమిరిశెట్టి నర్సింలు, పిఆర్పి రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్ గౌడ్, ధర్మారం మాజీ సర్పంచ్ మడావత్ మంకీయా నాయక్ పాల్గొన్నారు.

## మాదాపూర్ గ్రామంలో ముగ్గుల పోటీలు



**జయభేరి, తుర్కపల్లి, జనవరి 13 :**

తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి బహుమతులను సర్పంచ్ సీతరాజు అందజేశారు. మొదటి బహుమతి డి సంగీత, రెండవ బహుమతి సౌమ్యశ్రీ, మూడవ బహుమతి ఎస్ అంజలి, నాలుగో బహుమతి వి చందన, 5వ బహుమతి డి లాస్య, పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తూ మునుముందు యువకులకు క్రీడా కార్యక్రమాలు కూడా నిర్వహించి గ్రామ ప్రజల సహకారంతో ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించుకొని గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చు దిద్దుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మంగ్యా నాయక్, వార్డు సభ్యులు, పంచాయతీ వెంకటేష్, మహిళలు పాల్గొన్నారు.

## విజయవంతంగా ఛాలెంజ్ క్రికెట్ టోర్నమెంట్




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ స్థానిక ZPBHS గ్రౌండ్ నందు వారం రోజులపాటు నిర్వహించినటువంటి క్రికెట్ టోర్నమెంట్ దిగ్విజయంగా ముగిసినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న దేవరకొండ నియోజకవర్గం శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ , సతీమణి జ్యోతి ప్రసన్న స్పాన్సర్స్ బై అభిలాష్ నాయక్ పాల్గొని గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానోత్సవం చేసి అభినందనలు తెలియజేసినారు. శాసనసభ్యులు నేనావత్ బాల నాయక మాట్లాడుతూ దేవరకొండలో ఇండోర్ అవుట్ డోర్ స్టేడియాలు అందుబాటులోకి వచ్చే విధంగా తప్పనిసరిగా కృషి చేస్తానని క్రీడాకారులకు మాట ఇవ్వడం జరిగినది. క్రీడలు మానసిక ఉల్లాసానికి దాహోదపడతాయని అదేవిధంగా గ్రామీణ ప్రాంతంలో ఉన్నటువంటి కిడాకారులను ప్రోత్సహించడం కోసం ఇలాంటి టోర్నమెంటులో పెద్ద ఎత్తున నిర్వహించడానికి దోహదపడుతుందని అన్నారు. క్రీడాకారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని క్రీడల అభివృద్ధికైనా వంతు కృషి చేస్తానని అన్నారు. ఇంత పెద్ద ఎత్తున క్రికెట్ టోర్నమెంట్ ని విజయవంతం చేసినందుకు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులని అభినందిస్తూ అధ్యక్షుడు NVT ప్రత్యేకంగా అభినందించాడు.
అధ్యక్షుడు NVT మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ లో 28 టీములు పాల్గొనగా దేవరన్ రైజర్స్ విన్నర్స్ గా గెలుపొందడం, మేడారం క్రికెట్ టీం రన్నర్స్ గా గెలుపొందడం జరిగినదని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు NVT,శ్రీధర్ గౌడ్, రాపోలు నిరంజన్, శేఖర్,సన్నీ, శరత్,లిట్టు, యూనుస్ రాంసింగ్ నాయక్ సందీప్,పెద్దిరాజు, ఈశ్వర్, మోసిన్ , వెంకటేష్, నవీన్,మహేష్, వివిఆర్, బుడిగ వెంకటేష్ వల్లమాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీపై కాషాయ జెండా రెపరెపలే..

- ఏ పార్టీతోనూ పొత్తులు ఉండవు.. స్వతహాగానే పోటీ
- మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంటాం
- 12 వార్డుల్లో పోటీ చేస్తామంటున్న భారతీయ జనతా పార్టీ
- మా కార్యకర్తలను ఆశీర్వదిస్తే, మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తాం




**జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 13 :**

అత్యంత ప్రతిష్టాత్మకమైన యాదగిరిగుట్ట మున్సిపాలిటీపై ఈ పర్యాయం కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ పార్టీ ఆశాభావం వ్యక్తం చేసింది. ఏ పార్టీతో పొత్తులు ఉండవని, ఒంటరిగానే పోటీ చేస్తామని, మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకుంటామని కూడా బిజెపి పార్టీ తెలిపింది. మంగళవారం యాదగిరిగుట్ట పట్టణ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ భారతీయ జనతా పార్టీ అని.. ఈరోజు భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టిన ఘనత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దక్కుతుందన్నారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి ఓటు వేసి గెలిపించాలని యాదగిరిగుట్ట పట్టణ ప్రజలను కోరుతున్నాం. యాదగిరిగుట్ట పట్టణంలో కూడా ఎన్నో కేంద్ర ప్రభుత్వ పథకాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. మీరు ఓటు వేసి మా కార్యకర్తలను ఆశీర్వదిస్తే, మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తాం అని ఆయన పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. యాదగిరిగుట్ట పట్టణంలోని అన్ని వార్డుల్లో భారతీయ జనతా పార్టీ పోటీ చేస్తుంది. కచ్చితంగా యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ బీజేపీ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బిజేపి పార్టీ పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆకుల చంద్రమౌళి, పట్టణ ప్రధాన కార్యదర్శి నరేష్, జిల్లా భానుచందర్, కార్యదర్శి దొమ్మాట ప్రభాకర్, పలుగుల సురేష్, సీనియర్ నాయకులు లెంకల పల్లి శ్రీనివాస్, బందారపు మల్లేష్, బోడ సురేష్, శ్రీశైలం, దేవేందర్, వంశీ, అనిల్, శివ తదితరులు పాల్గొన్నారు.



# రెండు నెలల పసికందు అమ్మివేత..!

- అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసిన అంగన్ వాడి టీచర్..!
- కేసు నమోదు దర్యాప్తు చేస్తున్న పోలీసులు..!

**జయభేరి, షాద్ నగర్, జనవరి 13 :**

రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం ఉప్పరిగడ్డ గ్రామపంచాయతీ పరిధిలోని లాల్ సింగ్ తండాలో రెండు నెలల పసికందూ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పట్టణ సీఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం లాల్ సింగ్ తండాకు చెందిన రేణుక వినోద్ కు నవంబర్ 2025 న శిశువుకు జన్మనిచ్చింది అయితే జనవరి 1వ తేది 2026 నుండి ఆ పసికందు కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన అంగన్వాడి టీచర్ చింటూ షాద్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది ఇదే క్రమంలో ఐసిడిఎస్ అధికారులతో పాటు ఆపరేషన్ స్మైల్ టీం షాద్ నగర్ పోలీసులు రంగంలోకి దిగి కేసు పై ఆరా తీశారు ఇదే క్రమంలో ఇన్వాల్ నర్వ గ్రామానికి చెందిన గోవింద్ అనే వ్యక్తి నుండి మరొకరికి పసికందును అమ్మి వేసినట్లు గుర్తించిన పోలీసులు పసికందు తల్లితండ్రులతో పాటు మధ్యవర్తిత్వం వహించిన గోవింద్ అనే వ్యక్తి పై చైల్డ్ ట్రాకింగ్ సెక్షన్ తో పాటు 143 బిఎన్ఎస్ యాక్ట్ ప్రకారం విచారణ చేస్తున్నట్లు తెలిపారు ఈ కేసులో ఎవరెవరి పాత్ర ఉందో వివరాలు త్వరలో తెలుస్తాయని తెలిపారు..

# కాంగ్రెస్ పార్టీలో చేరికలు



**జయభేరి, మేడ్చల్ :**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న పథకాలకు అకర్షితులై పార్టీలో చేరికలు మొదలు అయ్యాయని ఎల్లంపేట్ మాజీ ఎంపిటిసి కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం ఎల్లంపేట్ మున్సిపాలిటీకి చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు కుమార్ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేసిన నాయకులకు జిల్లా డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి కుమార్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరికలు ఉప్పందుకున్నాయని తెలిపారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో ఎల్లంపేట్ మున్సిపాలిటీ పై కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి సురేష్, విష్ణేశ్వర్ రెడ్డి, దేవేందర్, తుడుం రాజు, తుడుం శంకర్, కృష్ణ, చిత్తరి, అశోక్, తేజ, బాబు, అఖిల్, బాలు తదితరులు పాల్గొన్నారు.

# మాకం చంద్రమౌళికి ఘన సన్మానం

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలో నూతనముగా ఎన్నికైన బీసీ కార్మిక విభాగం పట్టణ అధ్యక్షులు మాకం చంద్రమౌళి ని మర్యాదపూర్వకంగా కలిసి, పట్టణ పద్మశాలి సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు.పద్మశాలి సంఘం పట్టణ గౌరవ సలహాదారులు, ప్రముఖ అడ్వకేట్ గాజుల ఆంజనేయులు చంద్రమౌళి కి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీ కార్మికుల సంక్షేమం కోసం చంద్రమౌళి శక్తివంచన లేకుండా కృషి చేస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్, కార్యదర్శి పగిడిమర్రి నాగరాజు, కోశాధికారి గాజుల వినయ్ కుమార్ , పద్మశాలి మహిళా సంఘం సభ్యులు,ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంకు పాదయాత్రగా బయలుదేరిన శివ స్వాములు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున దేవాలయం నందీశ్వర నగర్ దేవరకొండ నుండి శ్రీశైలానికి పాదయాత్రగా గురు స్వామి సురభి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శివ దీక్ష సేవా సమితి వారి సహకారంతోబయలుదేరిన శివ స్వాములు ఈరోజు రాత్రి విశ్రాంతి , సిద్దాపురంలో 14.1.2026 బుధవారం మున్ననూరు శివాలయంలో రాత్రి విశ్రాంతి, 15 .1. 2026 గురువారం మధ్యాహ్నం నుండి రాత్రి కూడా వటవర్లపల్లిలో విశ్రాంతి, 16.1.2026 శుక్రవారం బ్రహ్మగిరి (దోమల పెంట) రామాలయంలో మధ్యాహ్న విశ్రాంతి, సాయంత్రం శ్రీశైలం చేరుకుంటామని గురు స్వామి సురభి కృష్ణ మూర్తి అయ్యగారు తెలియజేసినారు.

# హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న నేనావత్ కిషన్ నాయక్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం తూర్పుపల్లి (బొడ్డు పల్లి) లోని కోమటి తండ లో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠలో బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనతో ఉండాలని అయన అన్నారు. నేనావత్ కిషన్ నాయక్ ని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. వారితో పాటు జై రామ్ గురుస్వామి, స్థానిక సర్పంచ్ వెంకటేశ్వరరావు, తిర్మల్ రావు, 3వ వార్డ్ కెశ్య, శంకర్, బాలు, గణేష్,రమేష్ నాయక్, నర్సింహ, సంతోష్, రమేష్ భక్తులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జీవితం ఎంత దూరం..

అమ్మ కడుపులో జీవం పోసుకున్నప్పుడు...
నా జీవితం మొదలైందని లెక్కలు వేసుకోన..
పుడమిపై జన్మించినప్పుడు
నా ఆయుషు మొదలైందని అనుకోనా...
పుట్టగానే ఎందుకు ఏడవలేదని వైద్యశాలలో వేసి
నా జీవితాన్ని మొదలు పెట్టేందుకు అమ్మనాన్న పడ్డ కష్టాన్ని లెక్కలేసుకొని.. నా జీవితాన్ని మొదలు పెట్టన...
అడుగులు వేస్తూ బడివైపు దారి నడుస్తూ పుస్తకాలు మోస్తూ చదువుకుంటున్నప్పుడు నా వయస్సు
నా జీవితానికి తొలి మెట్టు అయింది...
తరగతి గది మారుతున్న కొద్ది నా వయసు పెరుగుతూ వచ్చింది...
పెరుగుతున్న వయసుకు ఎన్నో బాధ్యతలు బరువులు ఇబ్బందులు ఎదురవుతూ..
నా ఆయుష్ కాలాన్ని నా జీవితాన్ని పూర్తిగా తగ్గించి వేసాయి..
వాటన్నింటినీ నెట్టుకొస్తూ.. జీవితాన్ని ముందుకు నడిపిస్తూ
అనుభవాన్ని గడిస్తూ.. వయసుతో వచ్చిన వాటన్నింటినీ పోగొట్టుకొని... ఎంత దూరం నా జీవితం అంటూ.. ఇక చాలు... అనేవరకు నా జీవితం.. నే బ్రతికినంత కాలం..



**కడారి శ్రీనివాస్**
జయభేరి సీనియర్ జర్నలిస్ట్, 98489 62799
కవి రచయిత, గాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

# మాయమైపోతున్నదమ్మ మన సంస్కృతి చెన్నకిష్టయ్య

**జయభేరి, భువనగిరి, జనవరి 13 :**




మన భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు రోజురోజుకి కనుమరుగైపోతున్నాయని యాదాద్రి భువనగిరి జిల్లా గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు, సంఘసేవకులు, లయన్, డాక్టర్. అంబటి చెన్నకిష్టయ్య అన్నారు. భువనగిరి మండల కేంద్రంలోని వీరవెల్లిలో జరిగిన కస్తూరి అంజన్ దాసు ఆధ్యాత్మిక సభలో పాల్గొని ప్రసంగించిన ఆయన.. నేటి తరంపై కీలక విషయాలు వెల్లడించారు. అసలు ప్రజెంట్ జనరేషన్ ఎటు వెళ్తోంది అంటూ ఆయన ఘాటుగా స్పందించారు. 2025లో చేదు అనుభవం అని తన అమ్మ చనిపోయారని కన్నీటిపర్యంతమమైన చెన్నచెకిష్టయ్య.. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను కంటికి రెప్పలాగా చూసుకోవాల్సిందేనని పిలుపునిచ్చారు. ఇంకో ముఖ్యవిషయం ఏమిటంటే మన పిల్లలకు తాతయ్య, నానమ్మ, అమ్మమ్మల గొప్పతనాలను తల్లిదండ్రులే వివరించాలన్నారు. ఇంకా చెప్పాలంటే ఈ జనరేషన్ లో వారి డ్రెస్సింగ్, మాట్లాడే విధానాలపై క్లుప్తంగా చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే మన తెలుగు ఉన్న ఆవశ్యకతపై చాలా గొప్పగా మాట్లాడారు. దయచేసి మనమంతా తెలుగులోనే మాట్లాడాలన్నారు. ముఖ్యంగా ఎంతో కష్టపడి మన పిల్లల్ని చదివించి విదేశాలకు పంపిస్తే, కనీసం మనం చనిపోయినా వారు వారు రాలేని పరిస్థితులున్నాయని బాధపడ్డారు. కాబట్టి మన ట్యాలెంట్ ను మన దేశంలోనే ఉపయోగించి కన్న తల్లిదండ్రులు, ఉన్న ఊరు పేరును నిలబెట్టాలంటూ.. ఇవే కాక ఎన్నో ముఖ్యమైన విషయాలపై తన ప్రసంగంతో ఆకట్టుకున్న.. డాక్టర్ అంబటి చెన్నకిష్టయ్యను ఘనంగా సన్మానించారు నిర్వాహకులు డాక్టర్ లక్ష్మీనారాయణ. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ప్రముఖ కవి, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు సైతం డాక్టర్ చెన్నకిష్టయ్య ప్రసంగం పై కితాబునిచ్చారు.

# అవార్డులో జరిగిన అవకతవకలపై దర్యాప్తు జరపాలి

- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేసిన ఆలయ ఘాట్ రోడ్డు బాధితులు



**జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి13:**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా ఆలయ ఘాట్ రోడ్డు కోసం భూములు కోల్పోయిన బాధితులకు ఇచ్చిన అవార్డులో జరిగిన అవకతవకలపై వెంటనే విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని భూనిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు భూ నిర్వాసితుడు సామల పోశెట్టి ఆధ్వర్యంలో బాధితులు మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ హనుమంతరావును కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో బాధితులు పేర్కొన్న వివరాల ప్రకారం.. ఆలయ ఘాట్ రోడ్డు కోసం భూములు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించడానికి ప్రభుత్వం పాస్ చేసిన అవార్డులో అవకతవకలు జరిగాయని, నిర్వాసితులు 2025 మే 22న విజిలెన్స్ కమిషనర్ కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన విజిలెన్స్ కమిషనర్ సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని 2025 మే 31న ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ (రెవెన్యూ డిపార్ట్మెంట్)ని ఆదేశించారు. జరిగిన అవకతవకలపై నెల రోజుల్లో విచారణ జరిపి, చర్యలు తీసుకుని రిపోర్ట్ పంపించాలని 2025 జూలై 4న యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కు ప్రభుత్వ అడిషనల్ సెక్రటరీ రెవెన్యూ విజిలెన్స్ డిపార్ట్ మెంట్ ఆదేశాలు జారీ చేశారు. అయినా జిల్లా కలెక్టర్ ఎలాంటి రిపోర్ట్ పంపించకపోవడంతో.. వెంటనే దర్యాప్తు చేసి,చర్యలు తీసుకుని పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని 2025 నవంబర్ 10న ప్రభుత్వ సెక్రటరీ డీఎస్ లోకేష్ కుమార్ మరోసారి కలెక్టర్ ను ఆదేశించారు. అయినా ఇప్పటివరకు కలెక్టర్ హనుమంతరావు ఎలాంటి నివేదిక సమర్పించలేదని, అవకతవకలకు ఈ పాల్పడిన ఏ అధికారిపై చర్యలు తీసుకోకపోగా అండగా ఉంటున్నారని బాధితులు ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ వెంటనే విచారణ జరిపి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని, లేనియెడల ఈ నెల 30 నుండి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.

# జనసేన పార్టీ ముఖ్య నాయకుల సమావేశం

- మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీకి సిద్ధం
- రాబోయే మున్సిపల్ ఎన్నికలో షాద్ నగర్ లో జనసేన పార్టీ పోటీ చేయబోతుంది
- షాద్ నగర్ జనసేన పార్టీ నుండి సీనియర్ నాయకులు మహమ్మద్ అశ్రఫ్ పాల్గొన్నారు



**జయభేరి, షాద్ నగర్, జనవరి 13 :**

మున్సిపల్ ఎన్నికల్లో రంగంలోకి జనసేన పార్టీ. జనసైనికులు పోటీకి సిద్ధం కావాలన్న పార్టీ సీనియర్ నాయకులు. మహబూబ్ నగర్ పట్టణంలో మంగళవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో రాబోయే రోజులో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని 14 నియోజకవర్గలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని స్థానిక నాయకుడు ఆర్.ఆర్ రఘు ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికలపై సమావేశం నిర్వహించడం జరిగింది. రాబోయే రోజులో రానున్న మున్సిపల్ ఎన్నికలో అన్ని మున్సిపాల్టిలలో జనసేన పార్టీ పోటీ చేస్తుందని వివరించారు. అలాగే షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేయబోతుందని తెలియజేశారు. షాద్ నగర్ మున్సిపాలిటీ కౌన్సిలర్ గా జనసేన పార్టీ నుండి పోటీ చేయుటకు ఆసక్తి ఉన్నవారు స్థానిక నాయకుల జరుపుల రాజు నాయక్ మొహమ్మద్ అష్రఫ్ ను సంప్రదించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా జనసేన పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కలిసి పని చేద్దాం ప్రగతి వెలుగులు చూద్దాం

- రాజకీయాలు చేయొద్దు.. కాంట్రాక్టర్లను వేధించొద్దు
- కంసాన్ పల్లి - కిరాయి గుట్ట బీటి రోడ్డు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే
- గిరాయిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న వీర్లపల్లి



**జయభేరి, షాద్ నగర్, జనవరి 13 :**

పార్టీలు, రాజకీయాలు ఎన్నికల సమయంలో మాత్రమే ఉండాలి.. మిగతా సమయంలో పార్టీలకు అతీతంగా అందరం కలిసి నడుద్దాం.. గ్రామాలను, తండాలను అభివృద్ధి వైపు నడిపిద్దాం.. అని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఫరూక్ నగర్ మండలం కంసాన్ పల్లి గిరాయి గుట్ట తాండ రూ. 2కోట్ల విలువైన బీటీ రోడ్డు పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో అందరూ సహకరించాలని, కాంట్రాక్టర్ల ను ఇబ్బంది పెట్టకుండా వారికి సహకరిస్తే వేగంగా పనులు పూర్తవుతాయని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అదేవిధంగా షాద్ నగర్, కొత్తూరు మున్సిపాలిటీలను కూడా వార్డుల వారీగా అభివృద్ధి చేస్తున్నామని ఆయన వెల్లడించారు. నూతనంగా ఎన్నుకున్న సర్పంచ్లకు ఆయన అభినందించడంతోపాటు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. త్వరలో చించోడుకంసాన్ పల్లి మధ్యన రెండు లైన్ల బీటీ రోడ్డు ప్రారంభమవుతుందని, ఇందుకోసం మూడు కోట్లు మంజూరు అయ్యాయని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా భీమారంకంసాన్ పల్లి రహదారిని కూడా బాగు చేస్తామని హామీ ఇచ్చారు. గిరాయి గుట్ట తండాలో లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఎంతో ప్రాధాన్యత కలిగిన పురాతన ఆలయం అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఈరోజు స్వామివారిని దర్శించుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని ఆయన వెల్లడించారు. ఈ ఆలయ అభివృద్ధికి గతంలో తాము కూడా సహకరించామని, అయితే బూర్గుల రామకృష్ణారావు కుటుంబానికి చెందిన వారు ఈ ఆలయానికి అన్ని విధాల సహకరించడం ఎంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. తాండాకైనా, ఆలయానికైనా తన సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు చల్ల శ్రీకాంత్ రెడ్డి, మాజీ మండల పరిషత్ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, బాలరాజ్ గౌడ్, రాయికల్ శ్రీనివాస్, సుదర్శన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు..



# 'ది రాజాసాబ్' రీ వెర్షన్‌కు సూపర్బ్ రెస్పాన్స్..

పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ నటించిన లేటెస్ట్ సినిమా ది రాజాసాబ్. మారుతి తెరకెక్కించిన ఈ ఫాంటసీ హారర్ కామెడీ థ్రిల్లర్ సంక్రాంతి కానుకగా జనవరి 09న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే మొదటి షో నుంచే ఈ మూవీకి మిక్స్ డ్ టాక్ వచ్చింది. ప్రభాస్ రేంజ్ సినిమా కాదని నెగెటివ్ కామెంట్స్ వినిపించాయి. చాలా మంది ప్రభాస్ అభిమానులే ఈ మూవీపై పెదవి విరిచాడు. అయినా ఈ సినిమాకు మొదటి రోజే కళ్లు చెదిరే కలెక్షన్లు వచ్చాయి. తొలి రోజే రూ. 112 కోట్లు వసూలు చేసి ప్రభాస్ స్టామినాను మరోసారి ప్రూవ్ చేసింది. అయితే సినిమాకు నెగెటివ్ టాక్ రావడంపై స్పందించిన మేకర్స్ కొన్ని అనవసరమైన సన్నివేశాలను కట్ చేశారు. అలాగే ప్రభాస్ ఓల్డ్ లుక్ కు సంబంధించిన సీన్స్ యాడ్ చేశారు. ఇప్పుడిదే ది రాజాసాబ్ సినిమా కలెక్షన్లు అమాంతం పెరగడానికి కారణమని తెలుస్తోంది. తాజాగా ది రాజా సాబ్ నాలుగు రోజుల కలెక్షన్లను అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ది రాజాసాబ్ సినిమా ప్రపంచ వ్యాప్తంగా 201 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లను సాధించినట్లు ఓ పోస్టర్‌ని విడుదల చేశారు. మొత్తానికి మిక్స్ డ్ టాక్ తోనూ ఈ రేంజ్ కలెక్షన్లు రావడం ప్రభాసే కారణమని తెలుస్తోంది. అందులోనూ ఇప్పుడు మన శంకరవరప్రసాద్ లాంటి స్టార్ హీరోల సినిమాలు సంక్రాంతి పోటీలో ఉన్నాయి. అయితే 'రాజా సాబ్' హ్యూజ్ కలెక్షన్లు రావడంపై నిర్మాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# యశ్ 'టాక్సిక్' మరో బిగ్ షాక్..



యశ్ 'టాక్సిక్' సినిమా టీజర్ ఇప్పుడు సినిమా ఇండస్ట్రీలో టాక్ ఆఫ్ ది టౌన్ గా మారిపోయింది. టీజర్ హాలీవుడ్ లెవెల్ లో ఉందని ప్రశంసలు వినిపిస్తున్నప్పటికీ, అనవసరమైన రొమాంటిక్ సీన్లు జోడించారని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. వీటన్నిటి మధ్య టాక్సిక్ సినిమా వరుస ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం (జనవరి 12) 'టాక్సిక్' సినిమాపై కొందరు మహిళా కమిషన్ కు ఫిర్యాదు చేశారు. ఇప్పుడు ఇదే సినిమా విషయంలో కొందరు సెన్సార్ బోర్డు (CBFC) కు కూడా ఫిర్యాదు చేశారు. 'టాక్సిక్' సినిమా టీజర్‌లో అశ్లీల, అనైతిక సన్నివేశాలు ఉన్నాయన్నది చాలా మంది ఫిర్యాదు. ఈ నేపథ్యంలోనే టాక్సిక్ సినిమాకు సర్టిఫికెట్ ఇవ్వకూడదని డిమాండ్ చేస్తూ సామాజిక కార్యకర్త దినేష్ కల్లహల్లి సెన్సార్ బోర్డు (CBFC) కి ఫిర్యాదు చేశారు. టీజర్‌లో అశ్లీల దృశ్యాలు ఉన్నాయని, ఇవి మైనర్లపై చెడు ప్రభావం చూపుతాయని దినేష్ కల్లహల్లి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సినిమా టీజర్ సామాజిక నైతికత హద్దులు దాటిందని, కాబట్టి ఈ సన్నివేశాలను వెంటనే తొలగించాలని, సినిమా దర్శక, నిర్మాతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దినేశ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. 'టాక్సిక్' సినిమాపై కర్ణాటక ఆప్ మహిళా విభాగం మహిళా కమిషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ సినిమా టీజర్‌లోని కొన్ని సన్నివేశాలు అశ్లీలంగా ఉన్నాయని ఆప్ ఆందోళన వ్యక్తం చేసింది. ఎటువంటి వయస్సు హెచ్చరిక లేకుండా పబ్లిక్ డొమైన్‌లో విడుదల చేసిన ఈ దృశ్యాలు మహిళల గౌరవాన్ని కించపరిచేవిగా, కన్నడ సంస్కృతిని అవమానించేవిగా ఉన్నాయని ఆప్ రాష్ట్ర కార్యదర్శి ఉషా మోహన్ మండి పడ్డారు.

# హిట్ కావాలంటే కంటెంట్ ఉండాలి..



ఇలాంటి పీఆర్ గేమ్స్‌లో తాను ఎప్పుడూ భాగం కాలేదని తాప్సీ స్పష్టం చేశారు. నేను అలాంటి వ్యూహాలకు దూరంగా ఉండటం పట్ల చాలా రిలీఫ్‌గా ఫీలవుతున్నాను. నా పని నా సినిమాల ద్వారా మాట్లాడాలని నమ్ముతాను. ఇతరులను కిందకు లాగి పైకి రావడం నాకు ఇష్టం లేదు అని ఆమె తెలిపారు. ఈ మాటలు ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన పోటీ అవసరాన్ని గుర్తు చేస్తున్నాయని సినీ విశ్లేషకులు అంటున్నారు. తాప్సీ వ్యాఖ్యలు బాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం స్టార్ ఇమేజ్, సోషల్ మీడియా ట్రెండ్స్, వైరల్ కథనాలే సినిమాల భవితవ్యాన్ని నిర్ణయిస్తున్న సమయంలో, ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు పీఆర్ వ్యవస్థపై పెద్ద చర్చకు దారి తీస్తున్నాయి. చాలా మంది నెటిజన్లు తాప్సీ అభిప్రాయాలకు మద్దతు తెలుపుతూ, "సినిమా హిట్ కావాలంటే కంటెంట్ ఉండాలి కానీ కాంట్రవర్సీలు కాదు" అంటూ కామెంట్లు చేస్తున్నారు. కమర్షియల్ సినిమాలతో పాటు కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తాప్సీ పన్ను, ఈ వ్యాఖ్యలతో మరోసారి తన స్పష్టమైన ఆలోచనలను బయటపెట్టారు. పీఆర్ యుద్ధాల కంటే, నిజాయితీగా చేసిన సినిమా మాత్రమే ప్రేక్షకుల హృదయాలను గెలుస్తుందని ఆమె నమ్మకం ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు వస్తోంది.

# 100 ఎకరాల పొలం కావాలి.. పనులు మాత్రం రావాలి..



ఇటీవల ఓ ప్రమోషనల్ ఈవెంట్‌లో తనకు కాబోయే భర్త గురించి మాట్లాడిన మీనాక్షి చౌదరి, కొన్ని ఆసక్తికరమైన 'కండిషన్స్' పెట్టి అందరినీ నవ్వులు పూయించింది. తన భర్త డాక్టర్, నటుడు లేదా మిస్టర్ ఇండియా మాత్రం అసలు కాకూడదని స్పష్టం చేసింది. తాను ఇప్పటికే సినిమా రంగంలో ఉన్నానని, ఇంట్లో మరోసారి అదే ప్రొఫెషన్ అవసరం లేదని చమత్కారంగా వ్యాఖ్యానించింది. అంతేకాదు, తన జీవిత భాగస్వామికి 100 ఎకరాల పొలం ఉండాలి అంటూ చెప్పిన మాటలు ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యవసాయం, పల్లెటూరి వాతావరణం అంటే తనకు చాలా ఇష్టమని తెలిపింది. ఇక ఇంటి పనుల విషయంలో కూడా మీనాక్షి తన స్టైల్‌లో కండిషన్స్ పెట్టింది. వంట చేయడం, బట్టలు ఉతకడం, ఐరన్ చేయడం వంటి పనులు రావాలని చెప్పి నవ్వులు పూయించింది. అబ్బాయికి గతంలో బ్రేకప్స్ ఉన్నా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే పొడవుగా ఉండాలని మాత్రం కచ్చితంగా చెప్పింది. రోజుకు రెండు మూడు సార్లు లవ్ ప్రపోజ్ చేస్తూ, గిఫ్ట్స్ ఇచ్చే వ్యక్తే తన "రాజు" అంటూ సరదాగా పేర్కొంది. ఇటీవల కొంతకాలంగా మీనాక్షి చౌదరికి టాలీవుడ్ హీరోలతో ప్రేమాయణం ఉందంటూ పలు రూమర్స్ వినిపించాయి. అయితే వాటన్నింటినీ ఆమె ఖండిస్తూ, పూర్తిగా అబద్ధమని కొట్టి పారేసింది. ప్రస్తుతం తన పూర్తి ఫోకస్ సినిమాలపైనే ఉందని స్పష్టం చేసింది. 'అనగనగా ఒక రాజు' సినిమాతో పాటు మీనాక్షి చౌదరి ఇతర భాషల్లోనూ బిజీగా ఉంది. కోలీవుడ్ స్టార్ హీరో విక్రమ్ నటిస్తున్న 63వ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే తమిళంలో 'వృషకర్మ' అనే చిత్రంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది.

# మెగా అభిమానమే ఈ సినిమాకు ప్రేరణ




'నా కెరీర్‌లో చాలా వేగంగా పూర్తి చేసిన స్క్రిప్ట్ ఇది. కేవలం పాతిక రోజుల్లో స్క్రిప్ట్ పూర్తి చేశాను. దాని కారణం మెగాస్టారే. ప్రేక్షకులు ఆయనపై పెంచుకున్న అభిమానమే ఈ స్క్రిప్ట్‌కి ప్రేరణ. నవరసాలను అద్భుతంగా, అందంగా తనదైన శైలిలో ఆవిష్కరించగల అద్భుతమైన మహానటుడు చిరంజీవి. ఆయనలోని ప్రత్యేకతలన్నింటినీ తలచుకుంటూ, వాటిని కలుపుకుంటూ ఈ స్క్రిప్ట్‌ని సిద్ధం చేశాను. అందుకే ఇంత వేగంగా పూర్తిచేయగలిగాను. నా ప్రయత్నం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ నచ్చినందుకు ఆనందంగా ఉంది. ఈ సంక్రాంతిని కూడా నాకు మెమొరబుల్ చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి అన్నారు. ఆయన దర్శకత్వంలో అగ్ర కథానాయకుడు చిరంజీవి హీరోగా రూపొందిన కమర్షియల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్‌గారు'. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల కలిసి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతున్నది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మెగాబ్లాక్‌బస్టర్ థాంక్ యు మీట్‌లో అనిల్ రావిపూడి మాట్లాడారు. ఈ సినిమాతో బాక్సాఫీస్ కాస్తా బాస్ ఆఫీస్ అవుతుందని రెండు నెలల క్రితమే అనిల్‌తో చెప్పానని, అనుకున్నట్టే అద్భుతమైన విజయాన్ని ఈ సినిమా అందుకున్నదని నిర్మాత సాహు గారపాటి ఆనందం వెలిబుచ్చారు. ప్రేక్షకుల స్పందన అద్భుతంగా ఉందని, నిర్మాతగా ఇది తన తొలి సినిమా అనీ, మెగాస్టార్ కూతురుగా ఆయన పేరు నిలబెట్టాననే అనుకుంటున్నానని చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల అభిప్రాయపడ్డారు. ఇంకా సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో కూడా మాట్లాడారు.

Printed and Published, Editor & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com